క్లుప్తంగా

శాంతిభద్రతలకు సహకరించాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యలమంచిలి సీఐ గఫూర్

మునగపాక: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని యలమంచిలి సీఐ గఫూర్ కోరారు. మునగపాక పోలీసుస్టేషన్‌లో స్థానిక ఎస్‌ఐ పి.ప్రసాదరావుతో కలిసి శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులంతా సోదరభావంతో మెలగాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందన్నారు. కౌంటింగ్ కూడా ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గుంపులుగా కనిపించినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలన్నారు. వివాదాలకు తావులేకుండా కౌంటింగ్ సజావుగా జరిగేందుకు సహకరించాలన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : మునగపాక మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. శనివారం మధ్యాహ్నం మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. అలాగే గ్రామాల్లో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు కూడా బాధ్యతగా పనిచేసి శాఖాపరమైన అంశాలపై అభివృద్ధి జరిగేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులు తమ ప్రగతిని వివరించారు. ఎంపీడీవో ఎం.మన్మథరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

నేవీ నిర్వాసిత రైతులను ఆదుకోవాలి

రాంబిల్లి : నేవీ నిర్వాసిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివాజీ డిమాండ్ చేశారు. పెదకలవలాపల్లిలో నిర్వహిస్తున్న ధర్నా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేవీ ప్రహరీ నిర్మాణంతో రైతుల పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేకుండా పోతుందన్నారు. అలాగే కొండ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేస్తుండడంతో పశువుల మేతకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు దేముడు నాయుడు, మాజీ ఎంపీటీసీ రావి దేముళ్లు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ అయిన కళాశాలలో అడ్మిషన్లు

ఎస్.రాయవరం : మండలంలో తొలిసారిగా ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన ఇంటర్మీడియట్ చదువుకునేందుకు అవకాశం వచ్చిందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సకురు సత్యనారాయణ తెలిపారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పాఠశాలలో ఎంపీసి, బైపీసీ గ్రూప్‌లు బోధన చేసేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమైందని చెప్పారు. పాఠశాలలో ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. జూన్ మొదటి తేదీ నుంచి తరగతుల బోధన జరుగుతుందని చెప్పారు. మండలంలో వివిధ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి, రిజర్వేషను ప్రయార్టీ ఉన్నవారికి మొదటిగా సీట్లు కేటాయిస్తామన్నారు.

వజ్ర కవచాలంకరణలో వెంకన్న



కశింకోట: కశింకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకొని స్వామి వారిని వజ్ర కవచధారణతోపాటు వివిధ రకాల పూలమాలల, తులసీ మాలలతో శనివారం చూడముచ్చటగా అలంకరించారు. విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఏళ్ల నాటి కల నెరవేరిన వేళ...


కె.వెంకటాపురంలో రోడ్డు పనులు

కోటవురట్ల : ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరిన వేళ పలు గ్రామాల ప్రజలు పట్టరాని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం మండలంలోని ఒక్క రహదారిని కూడా అభివృద్ధి చేయలేదు. రహదారులన్నీ గోతులు పడి అధ్వానంగా తయారయ్యాయి. టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం పైకి నెట్టేసి రహదారులు అభివృద్ధి చేయలేదంటూ దుష్ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మండలంలో సుమారు రూ.12 కోట్లు వెచ్చించి పలు రహదారులను అభివృద్ధి చేశారు. అధ్వానంగా ఉన్న రహదారులు అద్దంలా తయారయ్యాయి. వాహనాలు రయ్ రయ్‌ను దూసుకుపోతున్నాయి. మండలంలోని నర్సీపట్నం -రేవు పోలవరం రహదారిని నర్సీపట్నం మండలం పెద బొడ్డేపల్లి నుంచి కోటవురట్ల మండలంలోని రామచంద్రపురం జంక్షన్ వరకు సుమారు రూ.8 కోట్లతో అభివృద్ధి చేశారు. రామచంద్రపురం శివారు అల్లుమియ్యపాలెం రహదారిని రూ.2.50 కోట్లు, జల్లూరు నుంచి రామచంద్రపాలెం వరకు రూ.2 కోట్లు, అణుకు రహదారిని రూ.50 లక్షలతో అభివృద్ధి చేశారు. తాజాగా కె.వెంకటాపురం నుంచి విశ్వనాథపురం జంక్షన్ వరకు రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ రహదారిలో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. కాకినాడ జిల్లా తుని వెళ్లాలంటే ఇదే దగ్గరదారి కావడంతో ఎక్కువగా వాహనాల రాకపోకలు సాగుతాయి. గత టీడీపీ ప్రభుత్వంలోనే ఈ రహదారి మొత్తం శిథిలం కాగా అప్పటి ఎమ్మెల్యే అనిత అభివృద్ధిపై దృష్టి సారించలేదు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారి అభివృద్ధి చెందడంతో కె.వెంకటాపురం, కొడవటిపూడి గ్రామాలతో పాటు పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిశ్రమలో ప్రమాదంపై విచారణ

రాంబిల్లి : సింబయో పరిశ్రమను శనివారం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు పరిశీలించారు. రెండు రోజుల క్రితం ఈ పరిశ్రమలో రసాయనాలు పడి పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికుడు కాజల్ బౌరీ గాయపడ్డారు. ఈ నేపథ్యంలో చిన్నారావు పరిశ్రమను సందర్శించి విచారణ చేపట్టారు. ఇటీవల ఈ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు మృతి చెందారు. మరోసారి ఇక్కడ ప్రమాదం చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా సింబయో పరిశ్రమను పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీసినట్టు చిన్నారావు పేర్కొన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన కాజల్ బౌరీ కంపెనీకి వచ్చి విచారణకు హాజరైనట్టు తెలిపారు. ఇటీవల జరిగిన ప్రమాద ఘటన భద్రత ప్రమాణాల లోపం కారణంగా జరిగిందని అయితే తాజా ప్రమాదం మాత్రం అందుకు భిన్నంగా ఉందన్నారు. నైట్రోజన్ పైపు లీకై ఎసిటిక్ యాసిడ్ దుస్తులపై పడిందని, ఈ దుస్తులతో ముఖం తుడుచుకోవడంతో ముఖంపై గాయాలైనట్టు గుర్తించామన్నారు.

మూలపేట గంగాలమ్మతల్లి గుడికి విరాళాలు


మూలపేట గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న వెంకటాపురం సర్పంచ్ తాతాజీ-సునీత దంపతులు

మునగపాక : మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి శనివారం వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ-సునీత దంపతులు రూ.10,116, మాజీ సర్పంచ్ సుందరపు సుందరపు వెంకట కనకప్పారావు-నీలవేణి దంపతులు రూ.10,116, పాలసంఘ అధ్యక్షుడు సుందరపు వెంకట కాసులుబాబు-రజని దంపతులు రూ.5,116 వంతున విరాళాలను అందజేశారు. మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, కమిటీ సభ్యులకు వారు విరాళాలు అందజేశారు.

టీకాలతో రోగ నిరోధక శక్తి


వారాడలో చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్‌ఎం కుమారి

మాడుగుల రూరల్: సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా కేజే పురం పీహెచ్‌సీ పరిధిలోని 7 కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు శనివారం టీకాలు వేశారు. కేజే పురం 1, 2, శంకరం, ఎం.కోటపాడు, మాడుగుల-2, 3 సచివాలయాలు పరిధిలో, ఎం.కోటపాడు, ఎం.కోడూరు గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తల సారథ్యంలో వ్యాధి నిరోధక టీకాలు వేసి, ఐరన్ మాత్రలు ఉచితంగా అందించారు. కేజే పురం, ఎం.కోడూరు గ్రామాల్లో జరిగిన వేక్సినేషన్‌ను ఆరోగ్య పర్యవేక్షకులు వెంకట్రావు, ఇతర చోట్ల ఆరోగ్య సహాయకులు పర్యవేక్షించారు.

కె.కోటపాడు: చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాలతో వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఏఎన్‌ఎం కుమారి తెలిపారు. వారాడ గ్రామంలో శనివారం 0-5 ఏళ్ల వయసున్న 16 మంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. 9 మంది గర్భిణులకు ధనుర్వాతం రాకుండా టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి


అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : వాసవీ మాత జయంతి సందర్భంగా పాయకరావుపేట వాసవి క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక చిత్రమందిర్ సెంటర్‌లో వాసవి మాతకు కుంకుమ పూజ, అన్నదాన కార్యక్రమాన్ని సుమారు 2000 మందికి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్లు రాయపూడి జయప్రకాష్, ఏల్చూరి విజయ, కార్యదర్శులు వి.సత్యనారాయణ, ఎ.పావని, కోశాధికారులు కె.నాని, ఎ.సుబ్బలక్ష్మి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎం.కోడూరు మోదకొండమ్మ పండగ నేడు


ఎం.కోడూరు మోదకొండమ్మ ఆలయం


ఎం.కోడూరు మోదకొండమ్మ

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరు గ్రామ ఆరాధ్య దేవత, మోదకొండమ్మా పండగ ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు శనివారం తెలిపారు. ఇప్పటికే నెల రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి డప్పు వాయిద్యాలు, 101 కాగడాల ప్రదర్శన జరిపారు. పండగ సందర్భంగా ఆదివారం అమ్మవారికి వెండి వస్తువులు, పట్టు వస్త్రాలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో ప్రధాన కూడళ్లను విద్యుత్ సెట్టింగ్‌లతో అలంకించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

పాయకరావుపేట : ఈ నెల 20వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీరాంపురం విద్యుత్ ఉపకేంద్రంలో అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలో శ్రీరాంపురం, రాజవరం, కేశవరం, ఎస్.నర్సాపురం, గజపతినగరం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కె.రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్లకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

పాడి రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు

కె.కోటపాడు: వేసవిలో పాడి రైతులు పశుగ్రాసం కోసం ఇబ్బంది పడకుండా, ముందస్తు చర్యల ద్వారా గడ్డి కొరతను అధిగమించవచ్చని ఎ.కోడూరు పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ అన్నారు. ఆర్బీకేలో పాడి రైతులకు శనివారం రాయితీపై గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. 5 కిలోల కాకిజొన్న రకం గడ్డి విత్తనాలు 75 శాతం రాయితీపై రూ.115కే అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్బీకేలో ప్రస్తుతం 50 కిలోల గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

వైభవంగా వాసవీమాత జయంత్యుత్సవం

- కేజే పురం, గాదిరాయి గ్రామాల్లో ఘనంగా వేడుకలు
- వాసవీ మాతకు ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాల్లో భక్తులు


జంపెన వాసవీ మాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కేజే పురం జంక్షన్‌లో వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు


కేజే పురంలో వాసవీమాతకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: వాసవీ మాత జయంతి ఉత్సవాలను కేజే పురం, గాదిరాయి గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. కేజే పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని ఆలయ కమిటీ, కేజే పురం వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిపారు. ఉదయం అమ్మవారికి నవ కలశ స్నపనం, పంచామృతాభిషేకాలు, నవకలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ, పూజలు, లలితాసహస్రనామార్చన చేశారు. స్థానిక మాజీ సర్పంచ్ పాలకుర్తి ఆదినారాయణ కుటుంబ సభ్యుల సహకారంతో మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరిపారు. శ్రీనాథు లక్ష్మణరావు కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, వాసవీ ఇంటర్నేషనల్ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు, వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనాథు శేఖర్, వీరవల్లి గ్రామానికి చెందిన మోదమాంబ భక్త బృందం సభ్యులు పాలకుర్తి శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ సభ్యులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జంపెన వాసవీమాత ఆలయంలో..

జంపెన గ్రామంలోని వాసవీమాత ఆలయంలో అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ, కింతలి గాదిరాయి సంఘం సభ్యులు సంయుక్త ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. జంపెన వాసవీమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు సారథ్యం జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు, కార్యదర్శి అనపగడ్డ అప్పారావు, ఉపాధ్యక్షుడు కొట్యాడ గున్నయ్య శెట్టి, కోశాధికారి పుట్టా కొండలరావు, రీజనల్ చైర్మన్ శ్రీనాథు కన్నయ్యశెట్టి, జిల్లా కోశాధికారి అనపగడ్డ హరిబాబు, జోన్ చైర్మన్ నాచు గున్నయ్యశెట్టి, కింతలి, వీరవల్లి, ఎం.కోడూరు, మాడుగుల గ్రామాలకు చెందిన వాసవీ క్లబ్ సభ్యులు, వాసవీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరాపల్లి: వాసవీమాత జయంతి పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాలల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముషిడిపల్లి అమ్మవారి ఆలయంలో వాసవీమాతను ప్రత్యేకంగా అలకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. దేవరాపల్లిలో ఆర్య వైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత సామూహిక వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొత్తపెంట వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


దేవరాపల్లిలో వాసవీమాత వ్రతంలో వాసవీ మహిళలు

మాడుగుల: మండలంలో సత్యవరం గ్రామంలో శనివారం వాసవీమాత జయంతి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు.

చీడికాడ: మండలంలోని జి.కొత్తపల్లి శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన జరిపారు.

సంయమనం పాటించాలి

- శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదు
- కౌంటింగ్ తర్వాత ప్రశాంత వాతావరణంలో ప్రజలు మెలగాలి
- డీఎస్పీ సత్యనారాయణ


సోమలింగపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

యలమంచిలి : ప్రజలు సంయమనం పాటించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. ఆయన శనివారం సాయంత్రం యలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న తరుణంలో యలమంచిలి పట్టణం, మండలంలో ప్రజలు సంయమనం పాటించి అల్లర్లకు దూరంగా ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసాక గ్రామాల్లో రాజకీయ కక్షలకు పోకుండా ప్రజలందరూ శాంతియుతంగా మెలగాలన్నారు. సోమలింగపాలెం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించి ఎన్నికల అనంతరం గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, రాజకీయ పార్టీ నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడడం నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి పట్టణ ఎస్‌ఐ కె.సావినాయుడు, రూరల్ ఎస్‌ఐ పి.సింహాచలం స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కౌంటింగ్ పూర్తయ్యే వరకూ 144 సెక్షన్

- పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ


స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

అచ్యుతాపురం : ఓటర్ల లెక్కింపు పూర్తి అయ్యే వరకూ ప్రజలంతా సంయమనం పాటించాలని పరవాడ డీఎస్పీ కె.వి సత్యనారాయణ సూచించారు. అచ్యుతాపురం మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో శనివారం సాయంత్రం పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. దిబ్బపాలెం తదితర గ్రామాల్లో స్థానిక ప్రజలనుద్దేశించి సూచనలు ఇచ్చారు. ఎన్నికల పోలింగ్‌కు, కౌంటింగ్‌కు బాగా విరామం ఉండడంతో చాలా చోట్ల కవ్వింపులు, గొడవలకు పాల్పడే అవకాశం ఉందన్న ఐబీ హెచ్చరికలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయ్యిందన్నారు. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఉంటాయని తెలిపారు. పండగలు, శుభ కార్యాలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా విన్యాసాలు చేపట్టరాదని హెచ్చరించారు. ఫలితాలు వెల్లడయ్యే వరకూ అన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పోలీసులకు సహకరించాలని తెలిపారు. సీఐ బుచ్చిరాజు,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు వినియోగించుకోండి


చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసిన దృశ్యం

నక్కపల్లి : చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి కె.జనార్దన్ కోరారు. శుక్రవారం గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ప్రత్యేక వేసవి శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ వేసవి శిబిరానికి వచ్చే విద్యార్థులకు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాల ద్వారా జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన విషయాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. చిత్రలేఖనం నేర్పిస్తున్నామన్నారు. చిన్న చిన్న పదాలను పయోగించి ఇంగ్లిష్ నేర్పిస్తున్నామన్నారు. ఇంగ్లిష్‌పై భయం పోగొట్టి ఆసక్తి పెంచడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు, వ్యాసరచన, వకృత్వ పోటీలు, క్విజ్ పోటీలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సెలవులు పూర్తయ్యే వరకు ఈ సమ్మర్ క్యాంపు కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

7వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం


విద్యార్థులకు పాఠ్యాంశాల పై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు


ఆటలు ఆడుతున్న విద్యార్థులు


పాయకరావుపేట : పట్టణంలో గల శాఖా గ్రంథాలయంలో మే 15 నుంచి జూన్ 7 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయం ఇన్‌ఛార్జి వామాల లక్ష్మణరావు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు కథలు వినడం, కథలు చెప్పడం, గేమ్స్ ఎయిమ్స్ ఆడించడం తరువాత పుస్తక సమీక్ష, కథలు చెప్పడం - చదవడం మాకిష్టం అనే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. డ్రాయింగ్, పెయింటింగ్ పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్ డ్యాన్స్ డ్రామా చెస్ డ్రామా, క్యారమ్స్ వంటి అంశాలతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులతో విద్యార్థులతో స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాక్స్ తెలుగు పదాలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని ఎంఈవో పీఎస్ఎన్ మూర్తి అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిత్యం గ్రంథాలయానికి వచ్చి చదువుకోవాలన్నారు. దీనివల్ల ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవచ్చన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ఇక్కడ ఉన్న విలువైన పుస్తకాలను చదువుకోవడం ద్వారా మరింత విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన ఈ శిబిరం జూన్ 7 వరకు కొనసాగుతుందని గ్రంథాలయ అధికారి చంద్రకళ తెలిపారు. ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చురుగ్గా ఆస్పత్రి భవన నిర్మాణం


మాడుగులలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ఆస్పత్రి భవనం

మాడుగుల: స్థానికంగా చేపట్టిన 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.5.50 కోట్లు నిధులు మంజూరు కావడం, పనులు తుది దశకు చేరుకోవడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పరిసర గ్రామ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం తీసుకున్న చొరవను కొనియాడుతున్నారు. భవన నిర్మాణం పూర్తి కానుండటంతోపాటు, అత్యాధునిక వసతులతో ఆస్పత్రి సిద్ధమవుతుందని తెలిసి మండల ప్రజలు సంతోషంలో మునిగితేలుతున్నారు. ఇక మీదట ఏ చిన్న అనారోగ్యం వచ్చినా జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సిన అగత్యం తప్పనుందని చెప్తున్నారు.

144 సెక్షన్ అమలుపై మైక్ ప్రచారం

రావికమతం: ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4 వరకూ ఎన్నికల కోడ్‌తో పాటు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ముగ్గురికి మించి ఒకే చోట గుమిగూడరాదని రావికమతం ఎస్‌ఐ ధనంజయ్‌నాయుడు అన్నారు. 144 సెక్షన్, ఎన్నికల నిబంధనల అమలుపై స్టేషన్ పరిధి గ్రామాల్లో శనివారం ఆటో ద్వారా ఆయన మైక్ ప్రచారం నిర్వహించారు.